క్లుప్తంగా

శ్రీశైల దేవస్థాన ఈఈ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న నరసింహారెడ్డి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా నరసింహారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఈఈ వి.రామకృష్ణ అన్నవరం దేవస్థానానికి బదిలీ కాగా.. అక్కడి ఈఈ నరసింహారెడ్డి శ్రీశైల దేవస్థానానికి బదిలీపై వచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం దేవస్థాన పరిపాలన భవనంలోని ఈఈ చాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించి మీడియా తో మాట్లాడారు. భక్తుల సౌకర్యార్థం క్షేత్రంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు.

నందికొట్కూరు ఎంపీడీఓగా సుబ్రహ్మణ్యశర్మ



నందికొట్కూరు: మండల పరిషత్ అధికారిగా సుబ్రమణ్యశర్మను ప్రభుత్వం నియమించింది. ఇక్కడి ఎంపీడీఓ శోభరాణి పత్తికొండకు బదిలీ కాగా.. ఆమె స్థానంలో వైఎస్సార్ కడప జిల్లా ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ రానున్నారు. ఈయన అక్టోబర్ 3న బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

జాబితాలో తప్పులుంటే సవరించుకోండి


సామాజిక తనిఖీని పరిశీలిస్తున్న ఏఓ పీరునాయక్

మిడుతూరు: పంట నమోదు జాబితాలో తప్పులు ఉంటే సవరించుకోవాలని ఏఓ పీరు నాయక్ రైతులకు సూచించారు. శుక్రవారం చౌట్కూరు గ్రామంలో ఖరీఫ్ పంట నమోదు కార్యక్రమంపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలలో పంట నమోదు వివరాలు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మదార్ సాహెబ్, అగ్రికల్చర్ అసిస్టెంట్ మాధవి, రైతులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత



బాధిత కుటుంబానికి బీమా సొమ్ము అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

వెలుగోడు: మండల పరిధిలోని బోయ రేవుల గ్రామానికి చెందిన కాకి అంజనమ్మ కుటుంబ సభ్యులకు పి.యం.జె.జె.బి.వై బీమా సొమ్మును కెనరా బ్యాంకు సీనియర్ మేనేజర్ సూర్యదేవర నాయక్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంజనమ్మ తమ ఖాతాదారు అన్నారు. ఆమె ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో రూ.2 లక్షల చెక్కును బాధిత కుటుంబానికి అందజేశామన్నారు.

మార్చిలోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోండి

జూపాడుబంగ్లా: వచ్చే ఏడాది మార్చిలోగా జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుంటే బిల్లులు మంజూరవుతాయని మండల హౌసింగ్ ఇన్‌చార్జ్ జ్యోతి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా జగనన్న కాలనీలలో బేస్మట్ట స్థాయిలో 56, లింటల్ లెవెల్‌లో 49, రూఫ్‌లెవెల్‌లో 31 ఇళ్లు ఉన్నాయన్నారు. వీరితో పాటు ఇళ్లు మంజూరై నిర్మాణాలు ప్రారంభించని వారు కూడా మార్చిలోగా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుంటేనే బిల్లులు మంజూరు చేస్తామన్నారు. శనివారం స్థానిక జగనన్న కాలనీలో మన ఇళ్లు–మన గౌరవం కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పించనున్నట్లు ఆమె తెలిపారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్లు

నంద్యాల(అర్బన్): స్థలం, భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలేఉ తీసుకుంటామని నంద్యాల సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్‌సత్తార్ తెలిపారు. దళారులను నమ్మి ఎవరూ మోసపోవద్దని, పరిమితి మేరకే స్టాంప్ రైటర్లను లోపలకు అనుమతిస్తామన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రమోషన్లు లేక పరిస్థితులను బట్టి 70 మంది గ్రేడ్–2 రిజిస్ట్రార్లు గ్రేడ్–1లుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. నిబంధనల ప్రకారమే తాను గ్రేడ్–1 రిజిస్ట్రార్‌గా విధుల్లోకి వచ్చానని, తన నియామకంలో ఎవరి రెకమెండేషన్ లేదన్నారు. తనపై ఎలాంటి కేసులు, ఆరోపణలు లేవని, స్టాంప్ రైటర్లతో ఎలాంటి సంబంధాలు లేవన్నారు.

నేర నియంత్రణ జిల్లాగా నంద్యాల

- ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా


మాట్లాడుతున్న ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లాను నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఆత్మకూరు సబ్ డివిజన్ పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, మిస్సింగ్ కేసులు, బాలికలపై జరిగిన నేరాలపై ఎస్పీ ఆరా తీశారు. రాత్రి గస్తీని ముమ్మరం చేసి చోరీలు జరగకుండా సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నేరస్తులను వెంటనే పట్టుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలపై జరిగే దాడులపై పోలీసులు సత్వరమే స్పందించాలని ఆదేశించారు. రానున్న పండుగలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, సీఐలు మోహన్‌రెడ్డి, విజయభాస్కర్, ఆదినారాయణ, ప్రియతంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తిరుమల ప్రతిష్టను దిగజార్చుతున్న బాబుకు శిక్ష తప్పదు

- డాక్టర్ ధార సుధీర్


నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ధార సుధీర్

నందికొట్కూరు: తిరుమల ప్రతిష్టను దిగజార్చుతున్న సీఎం చంద్రబాబు నాయుడుకు ఆ వెంకన్న స్వామే కచ్చితంగా శిక్ష వేస్తాడని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ధార సుధీర్ అన్నారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. చంద్రబాబు చర్యలను నిరసిస్తూ చౌడేశ్వరిదేవి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమం ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆలయాల శుద్ధి

పగిడ్యాల: కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం అపవిత్రమైందన్న నిరాధారమైన ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాటలను నిరసిస్తూ శనివారం ఆలయాల శుద్ధీకరణ చేపట్టనున్నట్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామి క్షేత్రానికి భంగం వాటిల్లేలా ముఖ్యమంత్రి నిరాధారమైన ఆరోపణలు చేయటం తగదన్నారు. ఆయన చేసిన ఆరోపణలను నిరసిస్తూ నందికొట్కూరు చౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

చీడపీడలను నివారించుకోండి


వరి పైరును పరిశీలిస్తున్న ఏఓ

కొత్తపల్లి: చీడపీడలను నివారించుకుని అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ రైతులకు సూచించారు. శుక్రవారం పాలెంచెరువు, గువ్వలకుంట్ల గ్రామాల పరిధిలోని వరి పొలాల్లో పొలబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసుకున్న వరి సాగులో దోమ ఉధృతిని తగ్గించేందుకు ఎకరాకు పది చొప్పున పసుపు రంగు జిగురు అట్టలు, మగ రెక్కల పురుగు ఉధృతిని తగ్గించేందుకు ఎకరాకు ఐదు నుంచి ఆరు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సుడిదోమ నివారణకు నత్రజని ఎరువులను రెండు, మూడు సార్లు వేయాలన్నారు. పొలాన్ని అడపాదడపా ఆరబెట్టాలన్నారు. ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే బ్యూప్రోఫెజిన్ 320 మి.లీ, డైనోటెఫ్యురాన్ 80 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 100గ్రా, లేదా కాసుగామైసిన్ 500 మి.లీ ఎకరాకి పిచికారీ చేయాలని రైతులకు అవగాహన కల్పించారు.

అభివృద్ధి ఎక్కడో చూపాలి


చెడిపోయిన బోరు మోటార్‌ను పరిశీలిస్తున్న నాయకులు

నందికొట్కూరు: వందరోజుల పాలనలో అభివృద్ధి, సూపర్ సిక్స్‌లోని సంక్షేమ పథకాల అమలు ఎక్కడో కూటమి నేతలు చూపాలని సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక జగనన్న కాలనీలో రైతు సంఘం నాయకులు పర్యటించారు. కాలనీ వాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చెడిపోయిన మోటార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజులుగా తాగు నీరు రాకపోవడం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారానికి ఒక ట్యాంకర్ పంపితే వంద కుటంబాలకు ఎలా సరిపోతాయో అధికారులు సమాధానం చెప్పాలన్నారు. కాలనీలో రహదారులు గుంతలమయమైనా పట్టించుకునే వారు లేరన్నారు. రైతు సంఘం నాయకులు స్వామన్న, భాస్కర్, షేక్షావలి, కాలనీవాసులు మహబూబ్‌బాషా, హుసేన్, జనార్దన్, నాయుడు, నూర్‌బాషా, రెహమాన్ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలను విజయవంతం చేద్దాం


ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న ఈఓ

మహానంది: దసరా నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దామని మహానంది ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక అలంకార మండపంలో శుక్రవారం ఉత్సవాల ఆహ్వాన పత్రికలకు పూజలు నిర్వహించి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు దసరా నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నామన్నారు. ప్రతి రోజూ అమ్మవారికి అలంకారాలు, గ్రామోత్సవాలు, శతచండీ యాగాలు, కలశార్చనలు, శ్రీ చక్రార్చన పూజలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వై.మధు, ఆలయ పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, నాగమల్లయ్య, నీలకంఠరాజు పాల్గొన్నారు.

వార్డెన్‌పై విచారణ

- అసభ్యకరంగా వ్యవహరిస్తున్నట్లు ఎంఈఓ ఎదుట విద్యార్థినుల ఆవేదన
- లిఖిత పూర్వకంగా ఫిర్యాదు


ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులను విచారిస్తున్న ఎంఈఓ–1 చిన్నమద్దిలేటి

జూపాడుబంగ్లా: మోడల్‌స్కూల్ హాస్టల్ వార్డెన్ లలితమ్మపై వచ్చిన పలు ఆరోపణల నిమిత్తం ఎంఈఓ–1 చిన్నమద్దిలేటి శుక్రవారం విచారణ చేపట్టారు. మోడల్ స్కూల్‌కు చేరుకుని ఆయన విద్యార్థినులను ఆరా తీశారు. కాగా తమ పట్ల అసభ్యకరంగా(బ్యాడ్ టచ్ చేస్తూ) ప్రవర్తిస్తుందని, బూతులు తిడుతుందని ఎంఈఓ ఎదుట విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన సూచన మేరకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. వంటవాళ్లు కూడా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టడం లేదని, హాస్టల్లోని నిత్యావసర సరుకులను బయటకు తరలిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ రమేష్, స్కూల్ ఉపాధ్యాయులతో ఎంఈఓ సమావేశమై హాస్టల్ వార్డెన్, హాస్టల్ నిర్వహణపై విచారించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ వార్డెన్‌పై వచ్చిన ఆరోపణల నిమిత్తం విచారణ చేశామని, నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారికి అందజేస్తామని తెలిపారు.

గొడవలు సృష్టిస్తే చర్యలు తప్పవు

- ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్


సర్కిల్ కార్యాలయ ఆవరణంలో ఇరువర్గాలకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ రామాంజి నాయక్

మిడుతూరు: గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే చర్యలు తప్పవని ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ హెచ్చరించారు. శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో పీరుసాహెబ్ పేట గ్రామానికి చెందిన ఇరువర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఐకమత్యంగా ఉంటూ ప్రశాంతంగా జీవనం గడపాలని సూచించారు.

పోక్సో కేసుపై డీఎస్పీ విచారణ

నాగలూటి గ్రామంలో ఓ బాలికపై అదే గ్రామానికి చెందిన వడ్డె ఎల్లరాజు అత్యాచారానికి పాల్పడినట్లు బంధువుల ఫిర్యాదు మేరకు ఈనెల 26న కేసు నమోదైంది. ఈ ఘటనపై డీఎస్పీ రామాంజి నాయక్ శుక్రవారం గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. బాధిత కుటుంబాన్ని కలిసి వివరాలు సేకరించారు. డీఎస్పీ వెంట నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ ఓబులేసు ఉన్నారు.

గురుకుల పాఠశాలను పరిశీలించిన ఎంఈఓ

సాక్షి ఎఫెక్ట్

జూపాడుబంగ్లా: నిధులు మంజూరు కాక చివరి దశలో నిలిచిపోయిన గురుకుల పాఠశాల అదనపు గదుల నిర్మాణాలను ఎంఈఓ –1 చిన్నమద్దిలేటి శుక్రవారం పరిశీలించారు. నిర్మాణాలు నిలిచిపోయిన విషయమై ×బిల్లులు రావు.. గదులు పూర్తి కావు₹ శీర్షికన ×సాక్షి₹ ప్రచురించిన కథనానికి ఎంఈఓ స్పందించి పాఠశాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తితో వివరాలు తెలుసుకున్నారు. నివేదికను జిల్లా అధికారులకు పంపనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఆత్మకూరు: కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం, ఆత్మకూరు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రామ్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలు, ధార్మిక సంస్థలు, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్టీసీ, విద్యాశాఖ, ఆలయాల్లో ఏళ్లుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ డైలీవేజ్, థర్డ్ పార్టీ కాంట్రాక్టు వర్కర్లుగా చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి కార్మికులకు ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలన్నారు.

మందుబాబుకు జైలు శిక్ష

బండిఆత్మకూరు: మండల పరిధిలోని బి.కోడూరు గ్రామానికి చెందిన ఈశ్వర్‌కు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్షను ఖరారు చేసినట్లు శుక్రవారం ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. గ్రామానికి చెందిన ఈశ్వర్ మద్యం తాగి గొడ్డలి చేత బట్టి రోడ్డున పోయే వారిని భయాందోళనకు గురి చేయడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అతన్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి 5 రోజులు జైల్ శిక్ష విధించినట్లు తెలిపారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వర దంపతులు

మహానంది: స్థానిక కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆంజనేయశర్మ, అర్చకులు శరభయ్యశర్మ ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకార మండపంలో కొలువుదీర్చి గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఆలయ పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

లొంగిపోయిన మరో నిందితుడు

మహానంది: సీతారామాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పసుపులేటి సుబ్బరాయుడును హత్య చేసిన నిందితుల్లో ఒకరైన నంద్యాల నందమూరి నగర్ కాలనీకి చెందిన షేక్ ఇర్ఫాన్ శుక్రవారం నంద్యాల రూరల్ సీఐ శ్రీనివాసులు రెడ్డి ఎదుట లొంగిపోయినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు 25 మందిని అరెస్ట్ చేశామని, మరొకరి కోసం గాలిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

30న త్రైక్వాండో ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక పద్మావతినగర్‌లోని ఇండోర్ స్టేడియంలో ఈనెల 30న త్రైక్వాండో అండర్–14, 17 బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ గిడ్డయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారుల వివరాలను ఎండీఎం ఫాంలో పొందు పరచాలన్నారు. త్రైక్వాండో కిట్లు క్రీడాకారులే తెచ్చుకోవాలన్నారు.

పారిశుధ్య పనులు

పాములపాడు: మండలంలోని ఇస్కాల గ్రామంలో సర్పంచు మౌలాలి శుక్రవారం పారిశుధ్య పనులు చేయించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా డ్రైనేజీలు చెత్తతో నిండిపోయి వీధుల్లో అపరిశుభ్ర వాతావరణం ఉండటంతో పారిశుధ్య సిబ్బందితో చెత్తా, చెదారంతోపాటు మురికి కాలువలను శుభ్రం చేయించినట్లు సర్పంచ్ తెలిపారు.

చోరీ కేసు నమోదు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని డార్మెటరీ నిర్వాహకుడు, ప్రైవేట్ చీటీల వ్యాపారి రామ్మోహన్‌పై కోర్టు ఆదేశాలతో వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పి.అనిల్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్ ఈనెల 23న సున్నిపెంట గ్రామంలో జరిగిన ఒక పార్టీకి హాజరయ్యారు. అనంతరం స్కార్పియోలో లింగాల గట్టుకు వెళ్లారు. అక్కడ అనిల్‌కుమార్‌ను వాహనం తాళాలు అడిగి తీసుకున్న రామ్మోహన్.. తిరిగి తాళాలు ఇవ్వకుండా శ్రీశైలం చేరుకున్నాడు. అలాగే అనిల్‌కుమార్ ఇంటి వద్ద ఉన్న మరో బొలెరో వాహనంతోపాటు, స్కూటీని తీసుకెళ్లాడు. దీంతో అనిల్‌కుమార్ కోర్టును ఆశ్రయించాడు. వాహనాలతోపాటు స్కార్పియోలో ఉన్న రూ.లక్ష చోరీ చేశాడని ఫిర్యాదు చేయడంతో స్పందించిన మెజిస్ట్రేట్ నిందితుడు రామ్మోహన్‌పై కేసు నమోదుకు శ్రీశైలం వన్‌టౌన్ పోలీసులను ఆదేశించింది.

మల్లన్నకు నృత్య నివేదన



నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణమాడవీధుల్లోని నిత్యకళావేదికపై నెల్లూరుకు చెందిన విజయ డ్యాన్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో శివపంచాక్షరి, ఓం నమఃశివాయ, శివ శివ శంకరా, శివతాండవ స్తోత్రం, ఓంకారనాదం తదితర గీతాలకు లక్ష్మీప్రసన్న, సాత్విక, ప్రియవర్షిణి, ప్రియదర్శిని, నందన్, నందనశ్రీ, గౌతమి, తరుణి, శివాని, లాస్య, విజయ్‌కుమార్ తదితరులు నృత్యాలు ప్రదర్శించారు.

స్వచ్ఛతలో భాగస్వాములు కండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

పగిడ్యాల: స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రజలు, అధికారులు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ వెంకటరమణ సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ఈనెల 17 నుంచి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, పౌరులు భాగస్వాములై పరిసరాలతోపాటు గ్రామాల్లో స్వచ్ఛత నెలకొల్పేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్డీ నాగేంద్రయ్య పాల్గొన్నారు.

ముగిసిన క్రీడాపోటీలు


మాట్లాడుతున్న అధికారులు

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఐదు మండలాల నుంచి దాదాపు 1000 మంది విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. ఆర్డీఓ ఎం.దాసు, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, హెచ్‌ఎం రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని, క్రీడల్లో రాణించే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లను అందించినట్లు చెప్పారు.

పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే కుట్ర


మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ

నందికొట్కూరు: పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎండీ రఫీ ఆరోపించారు. శుక్రవారం యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పులివెందల మెడికల్ కళాశాలకు సీట్లు కేటాయించొద్దని ఎన్‌ఎంసీకి సీఎం చంద్రబాబు లేఖ రాయడం దుర్మార్గమన్నారు. వేలకువేలకు ఫీజు కట్టి కోచింగ్‌లు తీసుకొని ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సరిపడా సీట్లు లేకపోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వంలో వైద్యవిద్యార్థులకు న్యాయం జరిగిందన్నారు. 50 శాతం సీట్లను కన్వీనర్ కోటా కింద, 50 శాతం సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్ కోటా కింద కేటాయించారన్నారు. ఈ ప్రభుత్వం నూతన కళాశాలలకు మౌలిక వసతులు కల్పించలేక, ప్రొఫెసర్లను నియమించలేక తమకు కళాశాల వద్దని కేంద్రానికి లేఖ రాయడం సిగ్గుచేటన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి పునరాలోచించాలన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు నవీన్, షాహీద్, బాలాజీ, హరి, వంశీ పాల్గొన్నారు.

ఎరువుల తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న జేసీ విష్ణుచరణ్

నంద్యాల(అర్బన్): జిల్లాకు వచ్చిన స్పిక్, కోరమాండల్ కంపెనీల ఎరువుల వ్యాగిన్‌ను జేసీ విష్ణుచరణ్ శుక్రవారం తనిఖీ చేశారు. వచ్చిన ఎరువులను ఎవరెవరికి సరఫరా చేస్తున్నారంటూ డీఏఓ మురళీకృష్ణ, రేక్ ఆఫీసర్ ప్రసాదరావులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఏఓ మురళీకృష్ణ ఎరువుల కంపెనీ సేల్స్ ఆఫీసర్ ముందస్తు ఎరువుల ప్రణాళిక ప్రకారం స్పిక్ యూరియా 422.5 మెట్రిక్ టన్నులు, డీఏపీ 441.5 మెట్రిక్ టన్నులు, 20:20:0:13 రకం 446.6 మెట్రిక్ టన్నులు, 28:28:00 రకం 480 మెట్రిక్ టన్నులు, సీఐఎల్ 20:20:0:13 రకం 1143 మెట్రిక్ టన్నులు కేటాయించారని, అందులో 50 శాతం మార్క్‌ఫెడ్‌కు, మరో 50 శాతం ప్రైవేట్ డీలర్లకు కేటాయించామన్నారు. కృత్రిమ కొరత సృష్టించే డీలర్లపై చర్యలు తీసుకుంటామని డీఏఓ తెలిపారు.

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపట్టిన నాగరాజు

గోస్పాడు: జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీరింగ్ అధికారిగా నాగరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న జిల్లా ఇంజినీరింగ్ అధికారి రామ్మోహన్‌ను ఉన్నతాధికారులు తిరుపతికి బదిలీ చేశారు. దీంతో బద్వేల్‌లో పని చేస్తున్న నాగరాజును ఉన్నతాధికారులు ఇక్కడ విధుల్లో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. గతంలో కూడా నంద్యాలలో ఐదేళ్లపాటు డీఈగా పని చేశారు. స్థానిక కార్యాలయ సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

తిమ్మరాజు చెరువు కట్టపై ఆందోళన వద్దు

అవుకు: తిమ్మరాజు చెరువు కట్టకు పెద్ద ప్రమాదం ఏమీ లేదని డ్యాం సేఫ్టీ చీఫ్ ఇంజినీర్ రత్నకుమార్ తెలిపారు. అవుకు రిజర్వాయర్‌లో భాగమైన తిమ్మరాజు చెరువు కట్ట రివెట్‌మెంట్ కుంగడం, కట్ట కింద నీరు లీకేజీ అవుతున్న విషయం విధితమే. ప్రజలు భయాందోళనకు గురవుతుండడంతో ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, కలెక్టర్ రాజకుమారి, డ్యాం సేఫ్టీ చీఫ్ ఇంజినీర్ రత్నకుమార్ శుక్రవారం తిమ్మరాజు చెరువు కట్ట, లీకేజీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజినీర్ రత్నకుమార్ మాట్లాడుతూ.. తిమ్మరాజు చెరువును అవుకు రాజులు నిర్మించారని గుర్తు చేశారు. రిజర్వాయర్‌కు రెండు స్లూయిస్‌లు ఏర్పాటు చేశారన్నారు. అయితే ఒక స్లూయిస్‌ను తీసివేసి మరో చోట ఏర్పాటు చేశారని తెలిపారు. తీసేసిన స్లూయిస్ వద్ద సిమెంట్ నిర్మాణం కొద్దిగా దెబ్బతినడం వల్ల నీరు పోతోందని చెప్పారు. నీటి లీకేజీ కొన్నేళ్లుగా ఉందన్నారు. దీని వల్ల ఎలాంటి ప్రమాదం లేదని తెలిపారు. అలాగే రిజర్వాయర్‌లో నీరు అధికంగా ఉంచడం వల్ల చెరువు కట్ట రివెట్‌మెంట్ సుమారు మీటరున్నర వరకు కుంగిందని, ప్రస్తుతం కుంగిన ప్రదేశాన్ని మట్టితో కప్పేశామన్నారు. రిజార్వాయర్‌లో నీటిని తగ్గించి లీకేజీ సమస్యను, రివెట్‌మెంట్ సమస్యను నెలలోగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. డ్యాం సేఫ్టీ బృందం ఎప్పటికప్పుడు కట్టను పరిశీలిస్తుందన్నారు. కట్ట కుంగిన సమయంలో సంబంధిత అధికారి సరిగ్గా స్పందించకపోవడంతో చర్యలు తీసుకున్నామని మంత్రి బీసీ తెలిపారు. వారి వెంట చీఫ్ ఇంజినీర్ బాషా, ఎస్ఈ వరప్రసాద్, ఎస్సార్‌బీసీ ఈఈ సురేష్ బాబు, టీడీపీ నాయకులు ఉన్నారు.

యాగంటి ఈఓ బాధ్యతల స్వీకరణ

బనగానపల్లె: యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయ ఈఓగా డీఆర్‌కేవీ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాల్వలో ఈఓగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈయన 2022లో యాగంటి ఈఓగా పనిచేశారు. కాగా ఇక్కడ ఈఓగా ఉన్న చంద్రశేఖర్‌రెడ్డిని ఓర్వకల్లు గ్రూపు టెంపుల్స్ ఈఓగా బదిలీ చేశారు. బదిలీపై వెళ్తున్న చంద్రశేఖర్‌రెడ్డి, కొత్తగా వచ్చిన డీఆర్‌కేవీ ప్రసాద్‌ను ఆలయ సిబ్బంది, అర్చకులు ఘనంగా సన్మానించారు. అర్చకులు మహేంద్రశర్మ, సత్యనారాయణశర్మ, లోక్‌నాథ్‌శర్మ పాల్గొన్నారు.